

వెలగని దీపం

దీపం-2 సబ్సిడీ అందలేదు. లబ్ధిదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

- 8లో



ఆదిత్యుని సన్నిధిలో..

అరసవల్లి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

- 8లో

జిల్లాలో తొలి కరోనా కేసు నమోదు



శ్రీకాకుళం: జిల్లాలో తొలి కరోనా కేసు నమోదైనట్లు సమాచారం. వ్యాధి లక్షణాలతో శనివారం రిమ్స్‌కు ఒక వ్యక్తి రాగా, పరీక్షలు జరిపి పాజిటివ్‌గా నిర్ధారించారు. ప్రస్తుతం ఆయన రిమ్స్‌లోని కోవిడ్ వార్డులో చికిత్స పొందుతున్నారు. వివరాలు తెలిపేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు.

న్యూస్‌రీల్

కరోనాపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ కె.అనిత

అరసవల్లి: కరోనా వ్యాధిపై జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత సూచించారు. ఈ మేరకు ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందన్నా రు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు పలు చోట్ల అమ్మవారి జాతరలు, సిరిమానోత్సవాల సందర్భంగా కరోనా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు మాస్కులు ధరించి ఉత్సవాల్లో పాల్గొనాలని సూచించారు. జనసమూహంగా ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలని, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతిరుమాళ్లను వినియోగించాలని తెలిపారు. జ్వరం, అలసట, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, రుచి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, ఈ మేరకు జిల్లా కేంద్రాస్పత్రి, రిమ్స్, జెమ్స్ (రాగోలు)లలో ఉచితంగా పరీక్షలను నిర్వహిస్తున్నట్లుగా తెలియజేశారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు ఇంటి నుంచి బయటకు రాకపోవడం మంచిదని సూచించారు.

నేడు షైనింగ్ అవార్డుల ప్రదానం

శ్రీకాకుళం న్యూకాలనీ: తాజా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరిట సోమవారం అవార్డులను ప్రదానం చేయనున్నారు. పదో తరగతిలో 179 మంది ఇంటర్మీడియెట్‌లో 35 మంది విద్యార్థులకు ఈ అవార్డులను పంపిణీ చేయనున్నారు. శ్రీకాకుళం 80 ఫీట్ రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి షైనింగ్‌స్టార్స్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు తమ ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటో లు, బ్యాంకు పాస్‌బుక్ ఒరిజినల్, మొదటి పేజీ జిరాక్స్ కాపీతో హాజరుకావాలని డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య వెల్లడించారు.

పేకాట శిబిరంపై దాడి


రణస్థలం: మండలంలోని వరిసాం గ్రామ సమీపంలోని పేకాట ఆడుతున్న పదిమందిపై జేఆర్‌పురం పోలీసులు ఆదివారం దాడి చేశారు. వీరి వద్ద నుంచి రూ.44,950 నగదు, అలాగే మూడు ద్విచక్రవాహనాలు, 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనురాగ నిలయంలో యోగా ప్రదర్శన



యోగా నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని అనురాగ నిలయంలో యోగాంధ్రలో భాగంగా ఆదివారం యోగా ప్రదర్శన జరిగింది. అలాగే ఆర్‌అండ్‌బీ బంగ్లా పరిసరాల్లో డీఆర్‌ఓ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ యోగా కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్, డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, మల్లేశ్వరరావు, యోగాచార్య రామారావు, తదితరులు పాల్గొన్నారు.





రైతన్న మోసపోయాడు. ఆదుకున్న రైతు భరోసా కేంద్రాల తలుపులు ఇప్పుడు తెరుచుకోవడం లేదు. సాయం చేసిన రైతు భరోసా ఏడాదిగా అందనేలేదు. ఖరీఫ్ ముంచుకువస్తున్నా విత్తనాల సంగతి ఎటూ తేలలేదు. సకాలంలో ఇంటి దగ్గరే ఎరువులు, విత్తనాలు అందజేసే ఓపిక సర్కారుకు లేదు. హామీలు ఇచ్చిన నేతలు ఇష్టానుసారం తేదీలు మార్చుకుంటూ పోతున్నారే తప్ప రూపాయి జమ చేసిన దాఖలా లేదు. సర్కారు సాయం లేక వ్యవసాయం భారమవుతోంది.

అన్నదాతకు వెన్నుపోటు

- రైతన్నను దగా చేసిన కూటమి సర్కారు
- వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే ఎరువులు, విత్తనాల అందజేత
- రైతు సేవా కేంద్రాలకు వెళ్లినా కానరాని వ్యవసాయశాఖ అధికారులు
- కలగానే మిగిలిన అన్నదాత సుఖీభవ
- నేటికీ అందుబాటులో లేని విత్తనాలు



సారవకోట మండలం చిన్నగుజ్జువాడలో తాళాలు వేసి ఉన్న రైతు సేవా కేంద్రం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

రైతన్న ఆశలు నీరుగారిపోతున్నాయి. ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆర్థిక సంక్షోభం బూచిని చూపిస్తూ ఒక్కో పథకాన్ని ఆపేస్తూ ఉంటే అన్నదాత గుండెలు అవిసిపోతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతన్నకు అన్ని రకాల సేవలు ఇంటి వద్దకే చేరేవి. ఏటా మూడు విడతలుగా రైతుభరోసా ఇచ్చే సంస్కృతికి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. దుక్కి దున్నడానికి, నాట్లు వేసేందుకు, కోత కోసేందుకు అవసరమైన ఖర్చుల కోసం మూడు విడతల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో వేసేవారు. ఎరువులు, విత్తనాల నాణ్యతా ప్రమాణాలు పరీక్షించేందుకు గాను జిల్లాలో అగ్రి ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఖరీఫ్‌కు ముందే రైతుభరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచేవారు. బ్యాంకర్లతో సమావేశాలు పెట్టి సున్నావడ్డీ రుణాలు సైతం ఖరీఫ్‌కు ముందే రైతులకు అందించేవారు.

కూటమి అధికారంలోకి వచ్చాక రైతు భరోసాకు 'అన్నదాత సుఖీభవ' అని పేరు మార్చారు. గత ఏడాది చిల్లిగవ్వ కూడా విదల్చలేదు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ పనులు మొదలవుతున్నా తేదీలు స్పష్టంగా చెప్పడం లేదు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు, విత్తనాలు సరైనవి ఇవ్వలేదు, ఎరువులు సమయానికి అందించలేదు, బహిరంగ మార్కెట్‌లో దళారులు విత్తనాలు, ఎరువులు ఇష్టం వచ్చిన ధరకు అమ్మకాలు చేసినా చర్యలు శూన్యం.

రైతుకు కూటమి చేసిందేమీ లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు చేసింది శూన్యం. ఇప్పటివరకు రైతుభరోసా డబ్బులు వేయలేదు. విత్తనాల కోసం కూటమి నేతల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఎరువులు సకాలంలో ఇవ్వడం లేదు. పెట్టుబడి సాయం, రైతు రుణాలు ఊసే లేదు. – నిక్కు కృష్ణారావు, రైతు, చీడిపూడి, సారవకోట మండలం.

రైతన్నను ఆదుకుంటాం



రైతును అన్ని రకాలుగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. విత్తనాలు రైతులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచాం. అన్నదాత సుఖీభవ డబ్బులు ఇచ్చేందుకు ఇప్పటికే జాబితా సిద్ధం చేశాం. మరికొద్ది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమవుతాయి. రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
– కోరాడ త్రినాథ స్వామి, జిల్లా వ్యవసాయాధికారి

ఇదీ తేడా..

- ✔ వైఎస్సార్ సీపీ హయాంలో కేంద్రం 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా ఇచ్చే రూ.6 వేలకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.7,500 కలిపి మొత్తంగా రూ.13,500 చొప్పున ఒక్కో రైతు ఖాతాలో జమ చేసేది. జిల్లాలో 3.22లక్షల మంది రైతులుండగా గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారానే రూ.1983.73 కోట్ల లబ్ధి అందించారు.
- ✘ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగు విడతలు కలిపి 3.22 లక్షల మంది రైతులకు రూ.611.08కోట్లు బకాయి పడ్డారు. ఖరీఫ్ మొదలైన ఇప్పటివరకు ఎలాంటి విధివిధానాలు రూపొందించకపోవడం దారుణమని రైతులు గగ్గోలు పెడుతున్నారు.
- ✔ ఖరీఫ్, రబీ సీజన్ మొదలయ్యే నాటికే రైతు భరోసా కేంద్రాలు కిటకిటలాడేవి. ప్రతి కేంద్రంలో నిత్యం రైతులు విత్తనాలు, ఎరువులు, ఈ-కేవైసీ చేసుకుని అర్హత ప్రాతిపదికన సేవలు పొందేవారు.
- ✘ కూటమి వచ్చాక పేరు రైతు సేవా కేంద్రం అని మార్చారు. కానీ తలుపులు కూడా తీయడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.
- ✔ వైఎస్సార్ సీపీ హయాంలో మే చివరి నాటికే విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేవారు.
- ✘ కానీ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 38,499 మెట్రిక్ టన్నుల విత్తనాలు అవసరం కాగా ఇప్పటి కేవలం 12000 మెట్రిక్ టన్నులు మాత్రమే ఏపీ సీడ్స్ ద్వారా పంపిణీకి సిద్ధం చేశారు.
- ✔ వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులందరికీ నిష్పక్షపాతంగా విత్తనాలు అందజేసేవారు.
- ✘ కూటమి హయాంలో నాయకుల ఇళ్ల వద్ద విత్తనాలు ఉంచుకుని తమకు ఓటేసిన వారికే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- ✔ డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద సీహెచ్‌సీ (సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లకు) యంత్ర పరికరాలు రాయితీపై అందించారు. 688 గ్రూపులకు గాను రూ.2618.057లక్షలు అందించారు.
- ✘ కూటమికి ఈ పథకం గురించి పట్టింపు లేకుండా పోయింది.
- ✔ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్ర ల్యాబ్‌తో కలిపి 9 కేంద్రాలకు భవన నిర్మాణాలు పూర్తిచేసి సిద్ధం చేశారు. జిల్లా కేంద్ర ల్యాబ్, ఇచ్ఛాపురం నియోజకవర్గ ల్యాబ్ తప్ప అన్నీ వర్కింగ్‌లోకి తీసుకొచ్చారు.
- ✘ కూటమి అధికారంలోకి వచ్చాక పూర్తిగా ఎక్కడా ఎరువులు, విత్తనాల నాణ్యతా ప్రమాణాలు తనిఖీలు చేసిన దాఖలాలు లేకుండా పోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఏపీఈఏపీ సెట్ ఫలితాలలో సిక్కోలు జోరు

- 9062 మంది హాజరుకాగా 6402మంది అర్హత సాధింపు



రుత్విక్ సాయికి స్వీట్స్ తినిపిస్తున్న తల్లి లత

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీఈఏపీ సెట్-2025 ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల జరిగిన ఈ పరీక్షా ఫలితాలు ఆదివారం సాయంత్రం వెలువడ్డాయి. జిల్లా నుంచి 9062 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 6402 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో పురుషులు 3711 మంది, బాలికలు 2691 మంది ఉన్నారు. జిల్లా నుంచి ఇంజినీరింగ్ విభాగంలో రిత్విక్‌సాయి రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంక్, బుడుమూరు విక్రంరాజా రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంక్, సాయి భరత్ 63వ ర్యాంక్‌తో సత్తా చాటారు. అలాగే అగ్రికల్చర్ విభాగంలో ఝాన్సీలక్ష్మీశృతి 11వ ర్యాంక్, వెంకటసాయి శ్రీనివాస్ రాష్ట్రస్థాయిలో 17వ ర్యాంక్, మైత్రి 33వ ర్యాంక్ స్థితప్రజ్ఞ 180వ సాధించి ప్రతిభ కనబరిచారు.



రుత్విక్ సాయి 9



ఝాన్సీ లక్ష్మీ శృతి 11

నరసన్నపేట: దేవాదికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయి, నరసన్నపేట మారుతీ నగర్‌కు చెందిన సూరప్పు ఝాన్సీ లక్ష్మీ శృతిలు ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో సత్తా చాటారు. ధర్మాన రుత్విక్ సాయి ఇంజినీరింగ్ విభాగంలో 9వ ర్యాంకు, లక్ష్మీ శృతి అగ్రికల్చర్ విభాగంలో 11వ ర్యాంకు పొందారు. జ్ఞాన రుత్విక్ సాయి ఇప్పటికే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓబీసీ కేటగిరీలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటి స్థానం పొందిన విషయం విదితమే. తల్లిదండ్రులు శంకర్ నారాయణ, లతలతో పాటు కుటుంబ సభ్యులు రుత్విక్‌సాయికి మిఠాయి తినిపించి అభినందించారు. అలాగే సూరప్పు లక్ష్మీ శృతి తల్లిదండ్రులు సూరప్పు కృష్ణారావు, సుధారాణి టీచర్లు. ఈమె నీట్ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.



శ్రీనివాస్ 17

సరుబుజ్జిలి: పురుషోత్తపురం పంచాయతీ సీతారామ్‌నగర్ కాలనీకి చెందిన సనపల వెంకటసాయి శ్రీనివాస్ అగ్రికల్చరల్‌లో 17వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తండ్రి అప్పలనాయుడు ప్రభుత్వ అధ్యాపకుడు కాగా, తల్లి గృహిణి.



విక్రమరాజ 21

ఎచ్చెర్ల: మండలంలోని అల్లినగరం గ్రామానికి చెందిన బుడుమూరు విక్రమరాజ ఇంజినీరింగ్ విభాగంలో 21వ ర్యాంకును సాధించాడు. తల్లిదండ్రులు సోమరాజు, కల్యాణి.



తర్ర మైత్రి 33

పోలాకి: పోలాకి మండలం తోటాడ గ్రామానికి చెందిన తర్ర మైత్రి అగ్రికల్చర్ విభాగంలో 33వ ర్యాంక్ సాధించింది. మైత్రి తల్లి ప్రభావతి కేజీబీవీ ఉపాధ్యాయురాలిగా, తండ్రి వైకుంఠరావు శ్రీకాకుళం మున్సిపల్ టీచర్ గా పనిచేస్తున్నారు.



లఖినాన శ్రీకర్ 133

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన లఖినాన శ్రీకర్‌కశ్యప్ అగ్రికల్చర్ విభాగంలో 133వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు లఖినాన వెంకటాచలం, శ్రీదేవిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. స్వగ్రామం నందిగాం మండలం పెద్దబాణాపురం కాగా కాశీబుగ్గలో స్థిరపడ్డారు.



మౌళి 177

నందిగాం: మండలంలోని నౌగాంకు చెందిన కుసుమూరు మౌళి అగ్రికల్చరల్ విభాగంలో 177వ ర్యాంకు సాధించాడు. తండ్రి గణపతి రాజమండ్రిలోని ఓ ప్రైవేటు కాలేజీలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు.



పడాల జాహ్నవి 258

పాతపట్నం: చిన్నలోగిడి గ్రామానికి చెందిన పడాల జాహ్నవి ఇంజినీరింగ్ విభాగంలో 258వ ర్యాంకు సాధించింది. తండ్రి పడాల రేవతి వల్లభరావు గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి పడాల శ్రీరామ్ జగదీశ్వరి హిరమండలం మండలం, గొట్ట ఎంపీపీయూపీ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.



వినయ్‌కుమార్ 535

సంతబొమ్మాళి: బోరుభద్రకు చెందిన మణిపాత్రుని వినయ్ కుమార్ ఇంజినీరింగ్ విభాగంలో 535వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తండ్రి శ్రీనివాస్ జర్నలిస్టు కాగా తల్లి సునీత గృహిణి.



సాయిఅనీష్ 667

కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన కుసిరెడ్డి సాయి అనీష్ ఇంజినీరింగ్ విభాగంలో 667వ ర్యాంకు సాధించాడు. సాయి అవినాష్ తండ్రి కుశిరెడ్డి గంగాధరరావు ఈస్ట్‌కోస్టు రైల్వేలో లోకో పైలెట్‌గా పనిచేస్తున్నారు. తల్లి కుశిరెడ్డి మమతారెడ్డి ఉపాధ్యాయురాలు.



బాలవర్ధన్ 684

మందస: మందస మండలం కుంటికోట గ్రామానికి చెందిన మానిమి బాలవర్ధన్ ఇంజనీరింగ్ విభాగంలో 684 ర్యాంక్ సాధించారు. తల్లిదండ్రులు మానిమి కృష్ణారావు, సుజాత.

గురువుల కన్నెర్ర

- డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన టీచర్లు
- బదిలీలను మాన్యువల్‌గా జరపాల్సిందేనని డిమాండ్
- వేధిస్తున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామంటున్న టీచర్లు



డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఉపాధ్యాయులు భగ్గుమన్నారు. మాన్యువల్ విధానంలో కాకుండా బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తామని ఉత్తర్వులు ఇవ్వడంపై కన్నెర్ర చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడని కూటమి సర్కారు తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వందలాది మంది ఉపాధ్యాయులు ఆదివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడించారు.

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకులు ఎస్.కిశోర్ కుమార్, మజ్జి మదన్ మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముట్టడి కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ ప్రారంభం కాకముందే ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని మాన్యువల్ విధానంలో ఎస్జీటీలకు కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్ మాట్లాడుతూ సంఖ్యాపరంగా వేలల్లో ఉన్న ఎస్జీటీలకు వెబ్ కౌన్సిలింగ్ చాలా ఇబ్బందికరమని అన్నారు. పీఆర్‌టీయూ జిల్లా శాఖ అధ్యక్షులు తంగి మురళీ మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలకు ముందు హామీ ఇచ్చినా హామీకి కట్టుబడకుండా, మండల కేంద్రాలకు వచ్చి వెబ్ ఆప్షన్లు పెట్టుకోమనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు దుప్పల రవీంద్ర, దుప్పల శివరాం ప్రసాద్, ఎల్.బాబురావు, జి.రమణ, బి.వెంకటేశ్వర్లు, పిసిని వసంతరావు, గొంటి గిరిధర్, పొందూరు అప్పారావు, ఎండ ఉమాశంకర్ కే.సోమేశ్వరరావు, బి.రమేష్, జి.భాస్కరరావు, బి.ధనుంజయరావు, జి.మల్లేశ్వరరావు, పి.రాజశేఖర్ రావు, కేశవరావు, ఎస్వీ రమణమూర్తి, రవికుమార్, పి.కాశీ విశ్వనాథరావు, వి.శరత్ బాబు, ఎస్.లక్ష్మణరావు, చావలి శ్రీనివాస్, పి.తిరుమలరావు, సదాశివుని శంకరరావు, బి.నవీన్ కుమార్, బి.డిల్లేశ్వరరావు, పి.శ్రీరామ్మూర్తి, ఎస్.శ్రీనివాస్, అన్నాజీరావు, ఎస్జీటీలు, పండిట్లు, పీఈటీలు వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇలా చేస్తుందని ఊహించలేదు



ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియకు ముందు ప్రభుత్వం మాతో జరిపిన చర్చల్లో మాన్యువల్‌గా బదిలీలు చేపడతామని చెప్పింది. కానీ చివర్లో వెబ్ కౌన్సిలింగ్ నిర్వహిస్తుందని ఊహించలేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. – మజ్జి మదన్ మోహన్, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకులు

ఎవరూ వెబ్ ఆప్షన్ ఇవ్వటం లేదు



ప్రభుత్వం ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేయాలని భావిస్తుండటం దుర్మార్గం. వెబ్ కౌన్సెలింగ్‌లో బదిలీలు జరిగితే ఒక్కో టీచర్ వేల సంఖ్యలో స్కూల్ పేర్లను ఆప్షన్లుగా ఇవ్వాలి. టీచర్లు ఎవరూ కూడా వెబ్ ఆప్షన్లు ఇవ్వడం లేదు. – దుప్పల శివరాం ప్రసాద్, ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

టీచర్లను హింసించడం తగదు




ఉపాధ్యాయ బదిలీల్లో టీచర్లను ఇంతలా హింసించడం తగదు. స్కూల్ అసిస్టెంట్లను సైతం వారి సీనియారిటీని పక్కనపెట్టి తీరని అన్యాయం చేశారు. – పిసిని వసంతరావు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉద్యమం తప్పదు



పాఠశాల విద్యాశాఖపై, ఉపాధ్యాయులపై అటు ప్రభుత్వం, ఇటు అధికారులు ఆది నుంచి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం దిగిరాకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ బాట పడతాం. తగిన సమయంలో కచ్చితంగా బుద్ధి చెబుతాం. – ఎండ ఉమాశంకర్, యూటీఎఫ్ సంఘ రాష్ట్ర కౌన్సిలర్

డ్వాక్రా సంఘంలో రూ.3 లక్షలు గోల్‌మాల్



సోంపేట: మండలంలోని గొల్లూరు పంచాయతీలోని గనగాలమ్మ ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లో సుమారు రూ.3 లక్షలు గోల్‌మాల్ అయినట్లు సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బారువ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రూపు సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గనగాలమ్మ గ్రూప్ సభ్యులు బారువ స్టేట్ బ్యాంక్‌లో బ్యాంక్ లింకేజి ద్వారా రూ.పదిలక్షల రుణం తీసుకున్నారు. అయితే సంఘ ఆర్గనైజర్ గజ్జి ఊర్వశి గత కొన్ని నెలలుగా సంఘ సభ్యుల వద్ద నుంచి సుమారు రూ.3 లక్షలు బ్యాంకుకు కడతానని తీసుకుని సొంత అవసరాలకు వాడుకున్నారు. ఆ డబ్బు బ్యాంకుకు కట్టలేదు. బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యులను నిలదీయడంతో ఆర్గనైజర్ గోల్‌మాల్ వ్యవహారం బయటపడింది. దీంతో గనగాలమ్మ గ్రూప్ సభ్యులు గ్రామ సంఘం వీఓఏ వంకల మోహనరావును అడిగారు. దీంతో ఆర్గనైజర్‌ను బ్యాంకు లింకేజీ కట్టమని వీఓఏ చెప్పారు. అయితే డబ్బు వాడుకుని ఐదారు నెలలుగా చెల్లించకపోయినా వీఓఏ గ్రూపు సభ్యులకు తెలియజేయక పోవడం గమనార్హం. దీంతో గ్రూపు సభ్యులు బారువ పోలీసులను ఆశ్రయించారు. ఆర్గనైజర్ భర్త అధికార పార్టీ నాయకుడు కావడంతో ఓ నియోజకవర్గ నాయకుడు కేసును సద్దుమణిగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో బారువ పోలీసులు సంఘ సభ్యులను సముదాయించి గోల్‌మాల్ చేసిన నిధులు ఆర్గనైజర్ చెల్లిస్తారని హామీ ఇవ్వడంతో గ్రూప్ సభ్యులు వెనుదిరిగారు. అయితే నిధులు గోల్‌మాల్ చేసిన ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. గ్రామానికి చెందిన ఇంకో సంఘంలోనూ ఇలాగే జరిగింది. విషయం బయటకు రావడంతో డబ్బు చెల్లించారు.

నేడు జిల్లావ్యాప్తంగా యోగా ర్యాలీలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిల్లో సోమవారం యోగా ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పౌరులు ఈ ర్యాలీలో పాల్గొనాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 7 గంటల నుంచి ర్యాలీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ర్యాలీ శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల) నుంచి ప్రారంభమవుతుందని, అందులో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పౌరులు పాల్గొంటారని తెలిపారు. గ్రామ/వార్డు స్థాయిలో సచివాలయ సిబ్బందితో కలిసి ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీ నిర్వహించాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలకు ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీస్ శాఖను, ప్రథమ చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్య సిబ్బంది ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. క్యాంపెయిన్‌ను విజయవంతం చేయడానికి ఏపీఎస్‌డీసీ స్కిల్ డవలప్‌మెంట్ అధికారులు, సెట్‌శ్రీ మేనేజర్, ఆయుష్ శాఖ అధికారుల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. యోగా శిక్షకుల కోసం ఆయుష్ శాఖ సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జిల్లాలో జి.సిగడాం మండలం ఎస్సీ రామచంద్రాపురం గ్రామానికి చెందిన తేజోమూర్తుల ఫణికుమార్ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా ఆదివారం అందజేశారు. ఈ మేరకు ఆలయ ఈవో వై.భద్రాజీకి విరాళ చెక్కును అందజేసి, ఆలయం నుంచి రశీదును పొందారు. అంతకుముందు ఆదిత్యునికి అంతరాలయం దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా



సూదికొండకు వెళ్లేదారిలో ట్రాక్టర్ పైకి లారీ నుంచి ఇసుక దంప్ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి పలు ప్రాంతాలకు వేలాది టిప్పర్లు, లారీలతో నిత్యం యథేచ్ఛగా ఇసుక సరఫరా జరుగుతోంది. నాయకులు ప్రాంతాల వారీగా ఒప్పందం కుదుర్చుకుని ఇసుకను ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, ఎక్సైజ్, మున్సిపల్ ఇలా అన్ని శాఖల అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఉచిత ఇసుక అని చెప్పి సొమ్ము చేసుకుంటున్న తీరు బహిరంగంగా జరుగుతున్నా దీనిపై ఎవరూ మాట్లాడకపోవడం ఆశ్చర్యకరం.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాద స్థలంలో లారీ

రణస్థలం: మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి వద్ద విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు ముందు వెళ్తున్న లారీని వెనుకనుంచి వచ్చిన మరో లారీ ఢీకొంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేకు వేయడంతో వెనుక వస్తున్న లారీ డ్రైవర్ క్షణాల్లో అప్రమత్తమై బ్రేకు వేసినా నెమ్మదిగా ఢీకొంది. దీంతో లారీ ముందరి భాగం బాగా దెబ్బతినడంతో చాలా సేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. డ్రైవర్ చిన్న, చిన్న గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జేఆర్‌పురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాద స్థలంలో ఆనందరావు మృతదేహం

గార: ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరు మండలంలోని మొదలవలస గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన రావాడ ఆనందరావు(28), అతని స్నేహితుడు దూగాన గణపతి ఇరువురు కలిసి ఫొటోలు తీసేందుకు శ్రీకూర్మం వైపు వెళ్తున్నారు. అయితే ఆదివారం సాయంత్రం కొళ్లపేట జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ప్రమాదం చోటుచేసుకుంది. రావాడ ఆనందరావు తల విద్యుత్ స్తంభానికి తగలడంతో అక్కడే మృత్యువాత పడ్డాడు. గణపతికి గాయాలవ్వగా 108 వాహనం ద్వారా రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏఎస్ఐ తెలుగు చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడుమూరు నుంచి కొత్తూరుపేటకు అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను లావేరు పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మద్యం అక్రమంగా తరలిస్తున్న కింతలి లక్ష్మణరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలగని దీపం..!



- రెండు నెలలైనా అందని దీపం- 2 సబ్సిడీ
- రెండో విడత సుమారు రూ.16,81,88,000ల బకాయిలు
- నగదు కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన దీపం పథకం ఫలితం నీరుగారుతోంది. సుమారు రెండు నెలలైనా దీపం–2 రెండో విడత నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో అమలుపై ఆందోళన చెందుతున్నారు. తొలి విడతలో ఈ పథకం ద్వారా అరకొరగా నగదు విడుదల చేసినా, రెండో విడత ప్రారంభం నుంచే ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. 2024 నవంబర్‌లో దీపం–2 పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం 2025 మార్చి 31 వరకు స్కీమును అమలు చేసింది. మొదటి విడత కొంతవరకు నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. తర్వాత రెండో విడత 2025 ఏప్రిల్ నుంచి ప్రారంభమైంది. అయితే ఇప్పటికి రెండు నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్క పైసా కూడా జమ కాలేదు. దీంతో లబ్ధిదారులు ప్రతిరోజూ బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఇదీ విషయం...

జిల్లాలో అన్ని గ్యాస్ కంపెనీలకు సంబంధించి 37 ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో సింగిల్, డబుల్ సిలిండర్ల కనెక్షన్లు అన్ని కలిపి 6,92,825 ఉన్నాయి. వీటిలో ప్రతినెల సుమారుగా 88 వేలుకి పైగా లబ్ధిదారులు గ్యాస్‌ను విడిపించుకుంటున్నారు. వీరందరికీ ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేయాల్సింది. మొదటి విడతగా 2024 నవంబర్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు నిర్ణయించారు. ఈ విడతలో ఐదు నెలలకు గాను జిల్లావ్యాప్తంగా 4,40,278 మంది లబ్ధిదారులు గ్యాస్ బుక్ చేసుకొని విడిపించుకొన్నారు. వీరిలో 4,35,035 కనెక్షన్లకు మాత్రమే నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యింది. 5,241 మంది లబ్ధిదారులకు రూ.49,78,950లు బకాయిలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. ఇకపోతే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై నెలాఖరు వరకు రెండో విడత గడువును నిర్ణయించింది. అయితే దీనికి సంబంధించిన నిధులు ఇప్పటివరకూ లబ్ధిదారులకు అందలేదు. రెండో విడతకు సంబంధించి రెండు నెలలు అనగా ఏప్రిల్, మే నెలల్లో జిల్లాలో సుమారుగా 1,77,040 మంది గ్యాస్‌ను బుక్ చేసుకున్నారు. వారు ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీలకు డబ్బులు చెల్లించి గ్యాస్‌ను పొందారు. అయితే వీరికి గాను ప్రస్తుతం ఉన్న గ్యాస్ సిలెండర్ ధర ప్రాప్తికి సుమారుగా రూ.16,81,88,000లు చెల్లించాల్సింది. అయితే దీనికి అతిగతీ లేకుండా పోయింది.

రోజుకోమాట

ఉచిత గ్యాస్ పథకంలో రెండో విడత నగదు విడుదలపై కూటమి ప్రభుత్వం కప్పగంతులు వేస్తోంది. రోజుకోమాట చెబుతూ ప్రజలను మభ్యపెడుతోంది. ఒక రోజు అన్ని డబ్బులు త్వరలో వేస్తామని చెబుతున్నారు. మరోసారి ముందుగానే లబ్ధిదారులకు డబ్బులు అందజేస్తాము, వారు ఆ డబ్బులతో సిలిండర్ విడిపించుకోవాలని చెబుతున్నారు. మరోసారి ఈ పథకం నడపడం సాధ్యం కాదని లోలోపల సమాచారం అందిస్తున్నారు. ఇలా ఈ ఉచిత గ్యాస్ పథకంపై ప్రభుత్వం రోజుకోమాట చెబుతోంది. ఈ ఉచిత సిలిండర్ పథకం ద్వారా అందజేసే నగదు జిల్లాలోని సివిల్ సప్లయ్, జాయింట్ కలెక్టర్ కంట్రోల్‌లో లేకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకుంది. తొలి విడతకు సంబంధించిన నగదు సంబంధిత గ్యాస్ (ఆయిల్) కంపెనీలకు జమ చేసింది. తొలి విడతకు సంబంధించి కొంత నగదు జమ చేయడంతో, ఆయిల్ కంపెనీలు ఆ నగదుని లబ్ధిదారులకు ఖాతాల్లో జమ చేశారు. అయితే రెండో విడతకు వచ్చేసరికి, ఈ నగదుని గ్యాస్ కంపెనీలకు ప్రభుత్వం జమ చేయలేదు. దీంతో లబ్ధిదారులకు సబ్సిడీ నగదు అందేలా కనిపించడం లేదు.

ఫిర్యాదులు బుట్టదాఖలు

దీపం పథకం ఉచిత సిలిండర్ రాయితీ నగదు అందలేదని చాలా మంది లబ్ధిదారులు పీజీఆర్ఎస్, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే వారి వద్ద నగదుకి సంబంధించి సమాచారం లేకపోవడం, గ్యాస్ కంపెనీలు తమ వద్ద ప్రభుత్వం నగదు లేదని స్పష్టం చేయడంతో ఫిర్యాదులను అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



ఆదిత్యుని దర్శనానికి బారులుతీరిన భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆదివారం విశేషంగా భక్తులు పూజలు జరిపించుకున్నారు. జ్యేష్ఠ మాస ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా భక్తులు తరలివచ్చి స్వామికి ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయించారు. ఇక అంతరాలయంలో ప్రత్యేకంగా తులసీదళాలతో ఆదిత్యుని మూలవిరాట్టును అలంకరించి సర్వదర్శనాలకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ అనుమతించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు దర్శనాలకు క్యూలైన్లలోకి వచ్చేశారు. ఆరోగ్యం కోసం భక్తులు సూర్య నమస్కారాల పూజలు చేయించుకుంటే.. మరికొందరు భక్తులు తలనీలాలను సమర్పించుకున్నారు. ఇదిలా ఉండగా ఒక్కరోజులోనే వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,15,200, విరాళాలు, పూజల ద్వారా రూ.91,388, ప్రసాదాల విక్రయాల రూపంలో రూ.1.98 లక్షల వరకు ఆదాయం లభించిందని ఈవో భద్రాజీ తెలియజేశారు.



పూజలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు తదితరులు

దర్శించుకున్న విజిలెన్స్ ఎస్పీ

అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని జిల్లా విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఆయనకు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, డీ–1 ఏఈ సురేష్‌కుమార్, ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశం

- జూన్ 30తో ముగుస్తున్న దరఖాస్తుల స్వీకరణ
- అవకాశం సద్వినియోగం చేసుకోవాలంటున్న విద్యుత్ శాఖాధికారులు



విద్యుత్ మీటర్

హిరమండలం: విద్యుత్ చార్జీల్లో తగ్గుదల కోరే వారికి ఆ శాఖ ఓ అవకాశం కల్పిస్తోంది. అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశమిస్తోంది. క్రమబద్ధీకరణ చేయించుకున్న వారికి అదనపు చార్జీల బెడద ఉండదని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా కనెక్షన్ ఇచ్చే సందర్భంలో కిలో వాట్ విద్యుత్ వినియోగానికి గృహాలకు రూ.2వేలు, దుకాణాలకు రూ.2500లు వసూలు చేస్తారు. చాలామంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి తమ వినియోగం 1నుంచి 2కిలో వాట్ లోపలే చూపిస్తున్నారు. వినియోగంలో అంతకు రెట్టింపు కేటగిరిలో చేరిపోతున్నారు. వాణిజ్య కనెక్షన్లకు సంబంధించిన వినియోగమైతే చూపించిన దానికంటే ఏకంగా నాలుగింతలు ఉంటోంది.

జరిమానా బెడద ఉండదు

- ఇప్పటివరకు అధిక లోడ్ నియంత్రణలో భాగంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది తరచూ ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేసేవారు. అధిక లోడ్ వినియోగిస్తున్న వారిని గుర్తించి రుసుంతో పాటు జరిమానా విధించేవారు.
- జిల్లాలో సుమారు 6.71లక్షలకు పైగా కనెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలోని వినియోగదారుల్లో 50శాతానికి మించి కనెక్షన్ తీసుకున్న సమయంలో చూపించిన వినియోగం కంటే అధికంగానే విద్యుత్ వాడుతున్నారు.
- గత ఐదేళ్లుగా ప్రతి నెల తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రీడింగులు తనిఖీ చేసి అధిక లోడ్ వినియోగిస్తున్న వారికి జరిమానా విధిస్తున్నారు.
- గృహాలు, దుకాణాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో దీపాలు ఇతర గృహోపకరణాల వినియోగాన్ని సగటున అంచనా వేసి లోడ్‌ను కిలోవాట్‌లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్ డెవలప్‌మెంట్ చార్జీలు వేస్తారు. అధిక శాతం గృహాలకైతే 1నుంచి 2కిలోవాట్‌లు, దుకాణాలకు 2 నుంచి 3కిలోవాట్‌లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు.
- ఇంటిలో అవసరాలు పెరగడం, దుకాణాలకు సంబంధించి వ్యాపార లావాదేవీలు పెరగడం, వాతావరణ పరిస్థితుల వల్ల అనుమతి తీసుకున్న దానికంటే అధికంగా విద్యుత్ వినియోగం ఉంటుంది.
- వినియోగం అంచనాకు మించడంతో నియంత్రికలపై లోడ్ ఎక్కువై తరుచూ ట్రిప్ కావడం లోటట్టేజ్ సమస్యలు పెరిగిపోతున్నాయి.
- ప్రతి అదనపు కిలోవాట్‌కి సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 నిర్ణయించారు. ఇదే సమయంలో డెవలప్‌మెంట్ చార్జీ రూ.1500 లు ఉంటుంది. కిలోవాట్‌లు పెరిగే కొద్దీ ఈ రుసుం మారుతుంది. దరఖాస్తుల స్వీకరణ గడువు జూన్ 30 తేదితో ముగుస్తుంది. కిలోవాట్ చొప్పున డవలప్‌మెంట్ చార్జీలలో 50శాతం రాయితీ లభిస్తుంది.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి



వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలి. ఇలా చేసుకుంటే అదనపు రుసుములు, జరిమానా బెడద ఉండదు.

– జి.శంకర్‌రావు, డీఈఈ విద్యుత్ శాఖ, టెక్కలి డివిజనల్

● కొంగు పట్టు.. బూరె పట్టు



జి.సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామంలో శివాలయం పునః ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా ఆదివారం ఆలయం శిఖరం నుంచి బూర్లు వేశారు. వాటిని మహిళలు కొంగువాది పట్టుకున్నారు. ఆద్యంతం ఉత్సాహంగా కార్యక్రమం చేపట్టారు. – జి.సిగడాం

ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని పాత శ్రీకాకుళంలో ఈనెల 10వ తేదీన జరిగే పెద్దమ్మ తల్లి, నూకాలమ్మ తల్లి సిరిమాను ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. శ్రీకాకుళం పట్టణం, పాత శ్రీకాకుళం (మావూరు వీధి, కలెక్టర్ బంగ్లా, హరిజన వీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట, దండివీధి, దేశర్ల వీధి, నక్క వీధి)లో పండగ నేపథ్యంలో రూట్‌మ్యాప్, బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి పర్యవేక్షించారు. జిల్లా పరిషత్, నక్కవీధి, సంతోషిమాత గుడి, కలెక్టర్ బంగ్లా తదితర రహదారి మార్గంలో కాలినడకన సందర్శించి భక్తుల దర్శనం, క్యూలైన్లను పర్యవేక్షించారు. సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారుల సాయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఆధారంగా మున్సిపల్ అధికారుల సమన్వయంతో మంచినీటి సదుపాయాన్ని ఇరువైపులా ఏర్పాటు చేయాలన్నారు. సిరిమాను తిరిగే ముఖ్య కూడళ్లు, గుడిలోపల, క్యూలైన్ల వద్ద సీసీ కెమెరాల నిఘా ఉండాలని, డ్రోన్ కెమెరాలు ఉపయోగించి భక్తుల రద్దీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించాలని, రహదారి మార్గాలు సులువుగా తెలుసుకునేలా సూచికా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్ని తాకుతున్న సంబరాలు



సోంపేట ఎంపీపీ నిమ్మన దాస్‌కు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారి ఊరేగింపు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో ఈనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు చేపడుతున్న కంచమ్మ తల్లి ఉత్సవాలు అంబరాన్ని తాకుతున్నాయి. గడచిన ఏడు రోజులుగా అమ్మవారు తిరువీధుల్లో ఊరేగింపుతోపాటు పలు సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఆంధ్ర, ఒడిశా ప్రాంతాలకు చెందిన కళాకారులచే ఏర్పాటు చేసిన వీధి నాటకాలు, నృత్యాలు ప్రశంసలు అందుకున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టేజీ ప్రోగ్రాంలు, స్థానిక ఈశ్వరీయ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ప్రవచనాలు, చిన్నారులతో అమ్మవార్ల వేషధారణలు ఆకట్టుకుంటున్నాయి.



అమ్మవార్ల వేషధారణలో చిన్నారులు

వైభవం.. శివ పార్వతుల కల్యాణం

జి.సిగడాం మండలంలోని చెట్టుపొదిలాం గ్రామంలో ఎండల మల్లికార్జున స్వామి అలయం పునః ప్రతిష్ఠ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. గ్రామ పురోతులు తనికెళ్ల సంతోష్‌కుమార్, నేతేటి రామకృష్ణ శర్మ అధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణం జరిపించారు. అనంతరం అలయ ప్రాంగణంలో భారీ అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

– జి.సిగడాం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



శివ పార్వతుల కల్యాణం చేస్తున్న దృశ్యం



హోమం చేపడుతున్న భక్తులు

నేటి నుంచి జిల్లాస్థాయి యోగా పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: యోగా ప్రోత్సాహానికి కొనసాగింపుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన యోగాంధ్రా క్యాంపెయిన్ – 2025లో భాగంగా సోమవారం నుంచి 14వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాస్థాయిలో యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు కలెక్టరేట్ సమీపంలోని డీఆర్‌డీఏ కాంప్లెక్స్‌లోని వెలుగు భవన్ ప్రాంగణంలో ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి జరుగుతాయి. పోటీల్లో భాగంగా ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగా పాటలు, చిత్రలేఖనం, స్కిట్, పోస్టర్ ప్రదర్శన, క్విజ్ తదితర అంశాలు ఉన్నాయి.

గ్రూపుల విభజన

వయస్సు ఆధారంగా గ్రూపులను విభజించారు. జూనియర్ గ్రూప్‌లో 10–18 సంవత్సరాలు, యువ గ్రూప్‌లో 19–35 సంవత్సరాలు, సీనియర్ గ్రూప్‌లో 35 ఏళ్ల పైబడినవారు ఉంటారు.

ఈ పోటీల నిర్వహణ బాధ్యతను జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు కె.త్రినాథస్వామి, ఉద్యాన శాఖాధికారి ఆర్వీవీ ప్రసాద్ చూస్తారు. డాక్టర్ అనిత (డీఎంహెచ్ఓ), డాక్టర్ కల్యాణ్ బాబు (డీసీహెచ్ఎస్), డాక్టర్ జగదీష్ (ఆయుష్ అధికారి)లు యోగా పోటీల సమగ్ర పర్యవేక్షణ కోసం నియమించారు. పోటీల సమయంలో ప్రతిరోజూ ఫలితాలను యోగాంధ్రా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాల్గొనేవారికి మంచినీరు, టిఫిన్, భోజన వసతులు, మొదలైన వాటిని కల్పించనున్నారు. యోగా పరవళ్లు విరజిమ్మేలా ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోందని కలెక్టర్ వెల్లడించారు.

లోక బాంధవ శతకం పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిషన్మందిరంలో పైడి హరనాథరావు రచించిన లోక బాంధవ శతకం పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ ఈ శతక పద్యములను సమాజ శ్రేయస్సు కాంక్షించి రచించినట్లు పేర్కొన్నారు. ధాన్యం పండించే రైతు, మంచుకొండల్లో ప్రాణాలు పణంగా పెట్టిన సైనికుడుపై పద్యాల రచన జరిగిందన్నారు.

కార్యక్రమంలో నారాయణమూర్తి, కోమలరావు, నిష్టల నరసింహమూర్తి, బలివాడ మల్లేశ్వరరావు, గుమ్మా నగేష్, శివరాం, విశ్వనాథం కామేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, పట్నాయిక్, విశ్వేశ్వరరావు, రమణ, సూరిబాబు, సరస్వతి, లక్ష్మి, విజయలక్ష్మి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న మందిరం సభ్యులు